ఆదివారం

11-08-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1 సంచిక: 421 పేజీలు: | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com




మద్యమే ఆరోగ్యానికి హానికరం..!

మిగతా 5లో



రెండో విడత నామినేటెడ్ పదవుల జాబితా ఖరారు

మిగతా 3లో



84దేశాల్లో భారీగా కరోనా కేసులు

మిగతా 2లో



సూర్య 'కంగువ' నుంచి క్రేజీ అప్‌డేట్..

మిగతా 5లో





# వయనాడ్‌లో పర్యటించిన మోడీ

## దెబ్బతిన్న ప్రాంతాల్లో ఏరియల్ సర్వే.. బాధితుల గురించి వివరాలు తెలుసుకున్న ప్రధాని

ముందడుగు కేరళ

కేరళ వయనాడ్ ప్రకృతి ప్రకోపానికి తుడిచిపెట్టుకుపోయిన ప్రాంతాల్లో ప్రధాని మోడీ పర్యటించారు. కొండచరియలు వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేపట్టారు. హెలికాప్టర్ ద్వారా ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ సాగుతున్న సహాయక చర్యలు, బాధితుల గురించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రధాని వెంట కేరళ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్, ముఖ్యమంత్రి పినరయి విజయన్, కేంద్ర మంత్రి సురేశ్ గోపి, స్థానిక అధికారులు ఉన్నారు. వయనాడ్ విళయాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రధాని పర్యటనపై లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ స్పందించారు. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో పీఎం మోదీ పర్యటిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇది సరైన నిర్ణయమన్నారు. ఇప్పటికైన వయనాడ్ విళయాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

# తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తాం

- కాలిఫోర్నియాలోని స్టాన్ ఫోర్డ్ యూనివర్శిటీ
- స్టాన్ ఫోర్డ్ యూనివర్శిటీ ప్రతినిధులతో రేవంత్ రెడ్డి భేటీ



ముందడుగు తెలంగాణ

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం అమెరికా పర్యటనలో ఉంది. పర్యటనలో భాగంగా కాలిఫోర్నియాలోని స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీ, గూగుల్ ప్రధాన కార్యాలయం, జొయిటిస్ కంపెనీని సీఎం సందర్శించారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, హెల్త్ కేర్ రంగాల్లో పరస్పర సహకారంపై స్టాన్ ఫోర్డ్ సెంటర్ ఫర్ బయోడిజైన్ సీనియర్ ప్రతినిధులతో రేవంత్ రెడ్డి బృందం చర్చించింది. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ముందుకొచ్చింది. హెల్త్ కేర్ రంగంలో భాగస్వామ్యం, కొత్తగా ఏర్పాటు చేయనున్న లైఫ్ సైన్సెస్, స్కిల్ యూనివర్సిటీలకు మద్దతుతో పాటు.. రాష్ట్రంలో కేంద్రం ఏర్పాటు చేయాలని స్టాన్ ఫోర్డ్ బయోడిజైన్ అధికారులను రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై గూగుల్ ప్రతినిధులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో తమ కెపాబులిటీ సెంటర్‌ను సెప్టెంబరులో విస్తరించనున్నట్టు జంతు ఆరోగ్య సంస్థ జొయిటిస్ ప్రకటించింది.

# 273 మంది పోలీస్ సిబ్బంది బదిలీ

కమిషనరేట్ పరిధిలో వివిధ స్థాయిలో పనిచేస్తున్న 273 మంది పోలీస్ సిబ్బందిని బదిలీ చేస్తూ..శుక్రవారం రాత్రి సీపీ శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కొందరు ఇన్‌స్పెక్టర్లను మల్టీజోన్‌కు పంపించగా, అక్కడి నుంచి వచ్చిన వారితో పాటు వెయిటింగ్‌లో ఉన్న కొందరికి పోస్టింగ్‌లు ఇచ్చారు. బదిలీ అయిన వారిలో 51 మంది ఇన్‌స్పెక్టర్లు, 81 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లతో పాటు వివిధ పోలీస్‌స్టేషన్లకు గతంలో అటాచ్‌మెంట్‌లో ఉన్న మరో 10 సబ్ ఇన్‌స్పెక్టర్లు సైతం ఉన్నారు. 141 మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. ప్రత్యేకంగా ఇందులో 22 మందిని సైబర్‌క్రైమ్‌కు, 16 మందిని సీసీఎస్‌కు కేటాయించారు.

ముందడుగు
ఆదివారం,
11-08-2024,
హైదరాబాద్



# బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు వద్ద ఆందోళనలు

### చీఫ్ జస్టిస్ గంటలో దిగిపోవాలని డిమాండ్.. పదవి నుంచి దిగిపోయిన చీఫ్ జస్టిస్

**ముందడుగు బంగ్లాదేశ్**


బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు లక్ష్యంగా మరోసారి దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున అల్లర్లు చెలరేగాయి. ప్రధాన న్యాయమూర్తి వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఇతర న్యాయమూర్తులు దిగిపోవాలంటూ కోర్టు వద్ద నిరసనలు చేశారు. దాంతో ఆయన దిగొచ్చారు. తాను రాజీనామా చేస్తానని వెల్లడించారు. బంగ్లా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి.. ఇతర న్యాయమూర్తులతో సమావేశానికి పిలుపునిచ్చారు. అయితే దీనికి తాత్కాలిక ప్రభుత్వం అనుమతి లేదని, అలాగే ఆయన దేశం విడిచి పారిపోవచ్చనే వార్తలతో ఈ నిరసనలు ఒక్కసారిగా చెలరేగాయి. విద్యార్థులతో పాటు పలువురు నిరసనకారులు సుప్రీంకోర్టు వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. దీంతో న్యాయమూర్తుల సమావేశం అర్ధంతరంగా ఆగిపోయింది. అక్కడితో శాంతించని ఆందోళనకారులు కోర్టును చుట్టుముట్టారు. చీఫ్ జస్టిస్ గంటలో దిగిపోవాలంటూ డిమాండ్లు చేయగా.. ఆయన అందుకు అంగీకరించాల్సి వచ్చింది.

# 50 గ్రాములకు రూ.850కోట్లు

### అక్రమ రవాణా చేస్తున్న ముఠా పట్టివేత

**ముందడుగు బీహార్**

బీహార్‌లోని గోపాల్ గంజ్ పోలీసులు అత్యంత విలువైన రేడియో యాక్టివ్ పదార్థం కాలిఫోర్నియంను స్వాధీనం చేసుకొన్నారు. ఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. దాదాపు 50 గ్రాముల బరువున్న ఈ పదార్థం విలువ అంతర్జాతీయ మార్కెట్లో రూ.850 కోట్లకు పైమాటే. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ స్వార్న్ ప్రభాత్ ధ్రువీకరించారు. నిందితులు ఈ పదార్థాన్ని అక్రమ రవాణా చేస్తున్నారని పేర్కొన్నారు. మా జిల్లా నుంచి విలువైన రేడియో ధార్మిక పదార్థాన్ని అక్రమ రవాణా చేస్తున్నట్లు ఓ టిప్ వచ్చింది. దీంతో మేం బృందాలు సిద్ధం చేశాం. డిస్ట్రిక్ట్ ఇన్వెస్టిగేషన్ యూనిట్‌ను అప్రమత్తంగా ఉంచాం. స్పెషల్ ఆపరేషన్ గ్రూప్, ఎస్టీఎఫ్ దళాలను రంగంలోకి దించాం. వీరిని ఉత్తరప్రదేశ్-బిహార్ సరిహద్దుల్లో మోహరించాం. ఈ సమయంలో మోటార్ సైకిల్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేయగా.. నాలుగు మొబైల్ ఫోన్లతోపాటు 50 గ్రాముల కాలిఫోర్నియం కూడా బయటపడింది. అంతర్జాతీయ మార్కెట్లో దీని ధర గ్రాము



రూ.17 కోట్లు" అని ఎస్పీ ప్రభాత్ వెల్లడించారు. నిందితులను చోటే లాల్ ప్రసాద్, చందన్ గుప్తాగా గుర్తించారు. వీరు ఈ కాలిఫోర్నియంను విక్రయించేందుకు కొన్ని నెలలుగా యత్నిస్తున్నట్లు చెప్పారు. దర్యాప్తును ముందుకు తీసుకెళ్లేందుకు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నుంచి ప్రత్యేక బృందాన్ని రప్పించామన్నారు. కాలిఫోర్నియంను పోర్టబుల్ మెటల్ డిటెక్టర్లలో వినియోగిస్తారు. వీటితో బంగారం, వెండి ఇతర విలువైన లోహాలను గుర్తించవచ్చు. దీంతోపాటు ఇంధన బావుల్లో నీరు, చమురు పొరలు గుర్తించేందుకు వాడతారు. ఇక విమానాల్లో లోహాల అరుగుదలను

# 84దేశాల్లో భారీగా కరోనా కేసులు

### ప్రపంచ దేశాలను హెచ్చరించిన డబ్ల్యూహెచ్ఓ



**ముందడుగు జాతీయం**

ప్రపంచంలోని పలు దేశాల్లో కరోనా మళ్లీ విజృంభించింది. 84 దేశాల్లో భారీగా పాజిటివ్ కేసులు నమోదు అవుతున్నాయి. ఈ మేరకు ప్రపంచ ఆరోగ్య సంస్థ.. డబ్ల్యూహెచ్ఓ హెచ్చరించింది. 2024. ఆగస్ట్ రెండు వారాల్లో కేసులు సంఖ్య.. సాధారణం కంటే 20 శాతం పెరిగినట్లు ప్రకటించింది. అంతేకాదు.. పారిస్ ఒలింపిక్స్ లో 40 మంది అథ్లెట్లు కరోనా సంబంధమైన శ్వాసకోశ వ్యాధుల బారిన పడ్డారని వెల్లడించి.. కలకలం రేపింది. కోవిడ్ టెస్టులు చేస్తే 10శాతం పాజిటివ్ కేసులు నమోదైయ్యాయని డబ్ల్యూహెచ్ఓ డాక్టర్ వాన్ కెర్ఖోవ్ జెనీవాలోని ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో తెలింది. కరోనా కేసుల పాజిటివిటీ ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ఉందన్నారు. ఈసారి తీవ్రమైన పరిణామాలు వస్తాయని ఆమె అన్నారు. డబ్ల్యూహెచ్ఓ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. అమెరికా, యూరప్ మరియు పశ్చిమ పసిఫిక్‌లలో కొత్త ఇన్ఫెక్షన్ కేసులు నమోదయ్యాయి. గత 18 నెలలుగా కోవిడ్ వ్యాక్సిన్ల లభ్యత బాగా తగ్గిందని డాక్టర్ వాన్ కెర్ఖోవ్ చెప్పింది. కోవిడ్ 19ని ఈ సారి సమర్థవంతంగా ఎదుర్కోడానికి ఆయా దేశాలు చర్యలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.




# గోల్డ్ మెడల్ గెలుచుకున్న వివాదాస్పద మహిళా బాక్సర్

### జెండర్ వివాదంలో ఇమేని ఖాలిఫ్‌పై ఆరోపణలు

**ముందడుగు జాతీయం**

పారిస్ ఒలింపిక్స్‌లో అల్జీరియాకు చెందిన వివాదాస్పద మహిళా బాక్సర్ ఇమేని ఖాలిఫ్ స్వర్ణ పతకం సాధించింది. వెల్టర్ వెయిట్ క్యాటగిరీ ఫైనల్లో ఆమె చైనా బాక్సర్ యాంగ్ లియూను ఓడించింది. పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం గెలుచుకున్నది. వెల్టర్‌వెయిట్ క్యాటగిరీ ఫైనల్లో ఆమె చైనా బాక్సర్ యాంగ్ లియూను ఓడించింది. 2022 వరల్డ్ చాంపియన్‌షిప్‌లో సిల్వర్ మెడల్ గెలిచిన ఖాలిఫ్.. ఆ తర్వాత లింగ వివాదాన్ని ఎదుర్కొన్నారు. ఆమెలో వై క్రోమోజోమ్‌లు ఎక్కువగా ఉన్నట్లు కొన్ని రిపోర్టుల ద్వారా తేలింది. పారిస్ ఒలింపిక్స్‌లోనూ ప్రీక్వార్టర్స్ లో ఇటలీ బాక్సర్.. కేవలం 46 సెకన్లలోనే మ్యాచ్ నుంచి వైదొలిగింది.2023 వరల్డ్ చాంపియన్‌షిప్ సమయంలో జెండర్ పరీక్ష ద్వారా ఇమేని ఖాలిఫ్‌ను అనర్హురాలిగా ప్రకటించారు. కానీ పారిస్ ఒలింపిక్స్ కోసం మాత్రం.. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ.. 2016, 2021 నాటి ఒలింపిక్స్ రూల్స్‌ను అమలు చేసింది. దీంతో బాక్సర్ ఖాలిఫ్‌కు పారిస్‌లో ఆడేందుకు అవకాశం దక్కింది.

ముందడుగు
ఆదివారం, 11-08-2024, హైదరాబాద్



## వారానికే రంగు వెలిసిన
# ఒలింపిక్ పతకం

### తాజా పతకం ఫోటోను షేర్ చేసిన అథ్లెట్

ముందడుగు జాతీయం

పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌పై చాలామంది అథ్లెట్లు ఇప్పటికే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఒలింపిక్ పతకంపై ఓ అథ్లెట్ పెట్టిన పోస్ట్ మరో వివాదానికి తెర లేపింది. పారిస్‌లో కాంస్యం సాధించిన అమెరికా స్కేటర్ నిజా హ్యూస్టన్.. వారానికే దాని రంగు పోయిందంటూ సంచలన ఆరోపణలు చేశాడు. ఈ మేరకు పతకం తాజా ఫొటోను షేర్ చేస్తూ నాణ్యత గురించి ప్రశ్నించాడు.
"ఈ ఒలింపిక్ పతకాలు కొత్తగా ఉన్నప్పుడు చాలా అద్భుతంగా కన్పించాయి. కానీ దాన్ని నేను వేసుకున్నాక చెమట తగిలి కొంత రంగు మారిపోయింది. అనుకున్నంత నాణ్యతగా లేవు. కాస్త గరుకుగా మారిపోయింది. ముందువైపు రూపు మారింది. ఈ పతకాల నాణ్యతను మరింత పెంచితే బాగుంటుంది. ఈ పతకాన్ని చూస్తుంటే ఏదో యుద్ధానికి వెళ్లి వచ్చినట్లుగా అనిపిస్తోంది" అని హ్యూస్టన్ పేర్కొన్నాడు. రంగు మారిన పతకం ఫొటోను షేర్ చేశాడు. గతవారం జరిగిన స్ట్రీట్ స్కేట్‌బోర్డింగ్‌లో ఈ స్కేటర్ కాంస్య పతకం నెగ్గాడు. దీనిపై పారిస్ ఒలింపిక్స్ అధికార ప్రతినిధి స్పందించారు. సామాజిక మాధ్యమాల ద్వారా విషయాన్ని తెలుసుకున్నామన్నారు. దీనిపై చర్యలు చేపట్టామని, డ్యామేజ్ అయిన మెడల్స్ స్థానంలో కొత్త వాటిని ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు.

## రెండో విడత నామినేటెడ్ పదవుల
# జాబితా ఖరారు

### సీఎం రాగానే అధికారికంగా ప్రకటన
### సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సమాచారం

ముందడుగు తెలంగాణ

తెలంగాణ ప్రభుత్వంలో రెండో విడత నామినేటెడ్ పదవుల జాబితా ఖరారైనట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన నుంచి వచ్చిన తరువాత ఈ జాబితాను అధికారికంగా ప్రకటించనున్నారు. ఇప్పటికే పార్టీ నాయకత్వం నామినేటెడ్ పదవుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అదే సమయంలో టీపీసీసీకి కొత్త సారధితో పాటుగా మంత్రివర్గ విస్తరణ పైన పార్టీ నాయకత్వం తుది నిర్ణయం తీసుకోనుంది.

#### సీనియర్లకు ప్రాధాన్యత

రెండో విడత నామినేటెడ్ పదవుల్లో భాగంగా మొదటి విడతలో చోటు దక్కని సామాజిక వర్గాలకు, నేతలకు ఈసారి బెర్త్ పక్కా అనే టాక్ పార్టీలో బలంగా వినిపిస్తుంది. ఈసారి చాలా కీలకమైన కార్పొరేషన్ పదవులు భర్తీ కానున్నాయి. ఆర్టీసీ కార్పొరేషన్, సివిల్ సప్లై కార్పొరేషన్, మూసీ కార్పొరేషన్, హెచ్ఎండిఏ, రెడ్కో, మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, హాకా, రైతు కమిషన్, విద్యా కమిషన్, స్టేట్ కౌన్సిల్ చైర్మన్, యాదవ, కూర్మ కార్పొరేషన్, చేనేత కార్పొరేషన్ పదవులు భర్తీ కానున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొందరి పేర్లు ఫైనల్ అయినట్లు సమాచారం.

#### జాబితా సిద్ధం

రైతు కమిషన్ చైర్మన్ గా సీనియర్ నేత కోదండరెడ్డి, విద్య కమిషన్ చైర్మన్ గా రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి పేర్లు ఆమోదించినట్లు పార్టీ నేతల సమాచారం. ఈ రెండు కమిషన్‌లలో చెరో నలుగురు చొప్పున 8 మందిని మెంబర్లుగా నియమించనున్నారు. ప్రస్తుత బీసీ కమిషన్ కాల పరిమితి ముగియనుంది. కొత్త కమిషన్ చైర్మన్ గా నిరంజన్ పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.



అదే విధంగా రాష్ట్ర హెచ్ఆర్సీ, సమాచార హక్కు చట్టం సభ్యులను నియమించాల్సి ఉంది. దీంతో, వచ్చే వారం రెండో విడత నామినేటెడ్ పదవుల భర్తీ జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

# లంచంగా 5కేజీల ఆలుగడ్డలు అడిగినా ఎస్ఐ

### ఎస్ఐని సస్పెండ్ చేసిన పోలీస్ ఉన్నతాధికారులు

ముందడుగు ఉత్తరప్రదేశ్

ఓ ఎస్ఐ 5 కేజీల ఆలుగడ్డలు లంచంగా ఇవ్వాలని అడిగినందుకు సస్పెండ్ అయ్యాడు. ఆలుగడ్డలు కొనడానికి ఎస్ఐ వద్ద డబ్బుల్లేవు అని అనుకుంటున్నారు కాని అలుగడ్డలు అనే పదాన్ని లంచానికి కోడ్ వర్డ్‌గా ఉపయోగించాడు. వివరాల్లోకి వెళితే.. ఉత్తరప్రదేశ్‌లోని కన్నౌజ్‌కి చెందిన రామ్ కృపాల్ సింగ్ అనే పోలీస్ సారిఖ్ స్టేషన్ పరిధిలోని భావల్‌పూర్ చపున్నా చౌకీలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఓ కేసును పరిష్కరించేందుకు బాధితుడి నుంచి ఆయన లంచం డిమాండ్ చేశారు. బాధితుడు అయిన రైతును ఎస్ఐ '5 కేజీల ఆలుగడ్డలు' లంచంగా కావాలని కోరాడు. అయితే రైతు 2 కిలోలు మాత్రమే ఇచ్చాడు. దానికి ఎస్ఐ అంగీకరించలేదు. చివరికి 3 కిలోల ఆలుగడ్డలకు ఒప్పందం కుదిరింది. దీనికి సంబంధించిన సంభాషణల వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ క్రమంలోనే ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. డబ్బుల కోసం ఆలుగడ్డల్ని కోడ్ వర్డ్‌గా వాడినట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలోనే ఎస్ఐని సస్పెండ్ చేస్తూ కన్నౌజ్ ఎస్పీ అమిత్ కుమార్ ఆనంద్ ఆదేశాలు జారీ




చేశారు. మరోవైపు కేసుపై శాఖపరమైన విచారణ చేపట్టారు.

### సుంకిశాల ప్రమాదంపై రాహుల్ గాంధీకి
## కేటీఆర్ సూటి ప్రశ్నలు..!

గ్రేటర్ హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్‌కు దగ్గరలో నిర్మిస్తున్న సుంకిశాల. సాగర్ నుంచి సర్జ్‌పూల్‌లోకి నీటిని నింపేందుకు ఏర్పాటు చేసిన మూడు టన్నెళ్లలో ఓ టన్నెల్ గేటు ఎట్టుకుపోగా.. 170 అడుగుల ఎత్తులో నిర్మించిన రిటైనింగ్ వాల్ కూలిపోయింది. అయితే, సుంకిశాల ప్రమాదంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నలు సంధించారు. ప్రమాదాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు ? సుంకిశాల ప్రమాదానికి ఎవరు బాధ్యులు? అంటూ ప్రశ్నించారు. సుంకిశాల ప్రమాదాన్ని చిన్నగా చూపే ప్రయత్నం చేస్తున్నారు ? సుంకిశాల ప్రమాదంపై ప్రభుత్వం నుంచి ఎవరూ మాట్లాడడం లేదంటూ నిలదీశారు. నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వాన్ని ఎవరు ఆపుతున్నారని ప్రశ్నించిన ఆయన.. సుంకిశాల ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# క్యాన్సర్‌తో యూట్యూబ్ మాజీ సీఈఓ మృతి

### తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సుందర్ పిచాయ్

ముందడుగు జాతీయం

క్యాన్సర్‌తో యూట్యూబ్ మాజీ సీఈవో సుసాన్ వోజ్‌కికీ కన్నుమూశారు. ప్రస్తుతం ఆమె వయసు 56 ఏళ్లు. సుసాన్ మరణవార్తను ఆమె భర్త డెన్నిస్ ట్రోపర్ సోషల్ మీడియా ద్వారా ధృవీకరించారు. ఈ మేరకు భావోద్వేగ పోస్ట్ పెట్టారు. రెండేళ్లుగా ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో పోరాడుతున్నట్లు చెప్పారు. శనివారం కుటుంబాన్ని వదిలేసి తిరిగిరాని లోకానికి వెళ్లిపోయిందంటూ భావోద్వేగానికి గురయ్యారు.యూఎస్‌కు చెందిన సుసాన్ 2014 నుండి 2023 వరకు యూట్యూబ్ సీఈవోగా పనిచేసిన విషయం తెలిసిందే.



అంతకు ముందు ఆమె గూగుల్‌లో పనిచేశారు. ఈ నేపథ్యంలో సుసాన్ మృతిపై గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాలు క్యాన్సర్‌తో పోరాడిన తన స్నేహితురాలు మరణించడం నమ్మశక్యంగా లేదని పేర్కొన్నారు. తను ఓ అద్భుతమైన వ్యక్తి అని, ఆమె లేని ప్రపంచాన్ని ఊహించడం కష్టమన్నారు. గూగుల్‌లో సుసాన్ కీలక వ్యక్తిగా వ్యవహరించారు. ఇంటర్నెట్‌ను రూపొందించడంలో ముఖ్యపాత్ర పోషించారు.

ముందడుగు
ఆదివారం,
11-08-2024,
హైదరాబాద్



## మాకు ఉద్యోగ భద్రత కావాలి

### మంత్రులను కలిసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

ముందడుగు హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పౌరసరాఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డిని తన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రి దనసరి అనసూయ సీతక్కను రాష్ట్ర సచివాలయంలో కలిశారు. మా సమస్యలను పరిష్కరించి, ఉద్యోగ భద్రత కావాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు. దీనికి రాష్ట్ర మంత్రివర్యులు ఇద్దరు సానుకూలంగా స్పందించడం జరిగిందని తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాలి శ్రీనివాస్ యాదవ్, మోబీన్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ తెలిపారు. వారితో పాటు కోశాధికారులు కొయ్యడి విజేందర్ గౌడ్, శ్యామ్ ముఖ్య సలహాదారులు అశోక్ 33 జిల్లాలకు సంబధించిన అధ్యక్షులు మరియు ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## యువ నాయకుల నైపుణ్యాలను మెరుగుపర్చాలి

### సుచిత్రా అకాడమీలో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు




ముందడుగు హైదరాబాద్

సుచిత్రా అకాడమీ నిర్వహించిన రెండు రోజుల 6 వ వార్షిక సదస్సు మోడల్ యునైటెడ్ నేషన్స్ కూలంకష చర్చలు, అంతర్దృష్టితో కూడిన చర్చలు మరియు సాంస్కృతిక మార్పిడి మధ్య ఎంతో ఘనంగా ముగిసింది. 'వాయిసెస్ R.I.S.E, సొల్యూషన్స్ సోర్' అనే ఇతివృత్తంతో జరిగిన ఈ సదస్సు, ప్రపంచ ఐక్యత మరియు బాధ్యత యొక్క భావాన్ని పెంపొందిస్తూ, ఒత్తిడితో కూడిన ప్రపంచ సమస్యలను పరిష్కరించడానికి నగరంలో ఉన్న యువకులను ఒకచోట చేర్చింది. యునైటెడ్ నేషన్స్ సెక్యూరిటీ కౌన్సిల్, ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి, జాయింట్ క్రైసిస్ కమిటీ, హై లెవల్ పొలిటికల్ ఫోరమ్ ఆన్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్, ఆల్ ఇండియా పొలిటికల్ పార్టీస్ మీట్, ఇంటర్నేషనల్ ప్రెస్, ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్, మరియు ఉన్నత స్థాయితో సహా పలు కమిటీలలో వివిధ దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 290 మంది విద్యార్థులు ఉత్సాహభరితమైన చర్చల్లో పాల్గొన్నారు. వీటిల్లో "కమిటీ X" ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది, ప్రతినిధుల అనుకూలత మరియు శీఘ్ర ఆలోచనను పరీక్షించే ఒక ఆశ్చర్యకరమైన కమిటీ. ఇది కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్ కు చెందినది.

## 17 నెలల తర్వాత ఇంట్లో టీ తాగుతున్నాను

### ఆప్ లీడర్ మనీష్ సిసోడియా పోస్టు

ముందడుగు ఢిల్లీ



17 నెలల తర్వాత ఇంట్లో టీ తాగుతున్నాను అని మనీష్ సిసోడియా పేర్కొన్నారు. భారతీయులందరికీ రాజ్యాంగం స్వేచ్ఛగా జీవించే హక్కు కల్పించింది. అందరితో పాటు కలిసి ఊపిరి పీల్చుకునే స్వేచ్ఛ భగవంతుడు మనకు ప్రసాదించాడు అంటూ పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీబీఐ నమోదు చేసిన కేసుల్లో సిసోడియాకు బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. కోర్టు ఆదేశాలతో శుక్రవారం సాయంత్రం సిసోడియా తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. అంతకుముందు.. రూ.10 లక్షల వ్యక్తిగత పూచీకత్తుతో, ఇద్దరు ష్యూరిటీ తీసుకొని ఆయనను విడుదల చేయాలని కోర్టు జైలు అధికారులను ఆదేశించింది. ఈ సందర్భంగా సిసోడియా తన పాస్‌పోర్ట్‌ను అప్పగించాలని, సాక్షులను ప్రభావితం చేయకూడదని, ప్రతీ సోమవారం, గురువారం ఏజెన్సీల అధికారుల ముందు హాజరుకావాలని ధర్మాసనం కొన్ని షరతులు విధించింది. కాగా, ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన కేసులో కిందటేడాది ఫిబ్రవరి 26న సీబీఐ అధికారులు అప్పుడు ఢిల్లీ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సిసోడియాను అరెస్టు చేశారు. అప్పటినుంచి ఆయన జైలులోనే ఉన్నారు.



## గూగుల్ క్రోమ్ యూజర్లకు హెచ్చరిక

ముందడుగు ఢిల్లీ

గూగుల్ క్రోమ్ యూజర్లకు కేంద్ర ప్రభుత్వం మరోసారి కీలక హెచ్చరికలు జారీ చేసింది. క్రోమ్ బ్రౌజర్‌లో అనేక బగ్‌లో ఉన్నాయని.. వాటిని హ్యాకర్లు ఉపయోగించుకోవచ్చని ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెనీ రెస్పాన్స్ టీమ్ పేర్కొంది. గూగుల్ యూజర్లు క్రోమ్ బ్రౌజర్‌ను వెంటనే అప్‌డేట్ చేయాలని సెర్ట్ ఇన్ సూచించింది. క్రోమ్ వెబ్ బ్రౌజర్‌లో చాలా లోపాలు ఉన్నాయని.. వాటిని వాడుకొని హ్యాకర్లు సిస్టమ్స్‌ను రిమోట్‌లోకి తీసుకొని నియంత్రించే అవకాశం ఉంటుందని పేర్కొంది. సిస్టమ్‌లో స్టోర్ చేసి పెట్టుకొని కీలకమైన డేటాను కాపీ చేసుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొంది. సిస్టమ్‌ను రిమోట్‌గా షట్‌డౌన్ చేయవచ్చని.. గూగుల్ క్రోమ్ బ్రౌజర్‌లో సేవ చేసుకున్న అన్ని పాస్‌వర్డ్‌లను సైతం తస్కరించేందుకు ఛాన్స్ ఉందని పేర్కొంది. అంతటితో ఆగకుండా మాల్వేర్‌ను నెట్‌వర్క్‌తో పాటు కంప్యూటర్‌లో చొప్పించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొంది. విండోస్, మ్యాక్ యూజర్లు తప్పనిసరిగా గూగుల్ క్రోమ్ 127.0.6533.88/89కి అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది. క్రోమ్ బ్రౌజర్‌ను ఆటోమేటిక్ అప్‌డేట్ మోడ్‌లో ఉంచాలని.. తద్వారా ఎప్పటికప్పుడు లోపాలను నివారించవచ్చని చెప్పింది.

ముందడుగు
ఆదివారం,
11-08-2024,
హైదరాబాద్

# మద్యమే ఆరోగ్యానికి హానికరం..!



## ఇంకా దానితో సోడా కలిపి తాగుతున్నారా.. మంచి ఆరోగ్యానికి రెండు మానెయ్యండి..

ముందడుగు ఆరోగ్యం

మద్యం ఆరోగ్యానికి హానికరం అని తెలిసినా మందుబాబుల సంఖ్య మాత్రం తగ్గడం లేదు.. ఏదో పార్టీలు అని, పండుగలు అని మద్యం తాగుతూనే ఉంటారు. యువత కూడా ఈ మధ్య మద్యం బారిన పడుతోంది. అల్కహాల్ మితంగా తాగితే ఆరోగ్యానికి ఎటువంటి ప్రమాదం ఉండకపోవచ్చు కానీ పరిమితి దాటితే మాత్రం అనారోగ్యం పాలుకాకతప్పదు.

### మందుబాబులు రకరకాలు..

మద్యం తాగే మందుబాబులు రకరకాలుగా ఉంటారు. కొందరు బీర్లు తాగితే.. మరికొందరు మాత్రం లిక్కర్ తాగుతారు. బీర్‌లో గ్యాస్ ఎక్కువగా ఉంటుందని.. తద్వారా పొట్ట వస్తుందన్న కారణంతో.. బీర్ కాకుండా విస్కీ, రమ్, వోడ్కా వంటి పానీయాలకుప్రాధాన్యత ఇస్తున్నారు. విస్కీ, రమ్, వోడ్కా వంటి బ్రాండ్స్ తాగేప్పుడు చాలామంది సోడా కలుపుకుంటారు. కానీ మద్యంలో సోడా కలిపి తాగితే మాత్రం ఆరోగ్యానికి చాలా ప్రమాదం..

**ఆల్కహాల్ శోషణం వేగంగా జరుగుతుంది:** సోడాలోని కార్బొనేషన్ ఆల్కహాల్‌ను రక్తప్రవాహంలో వేగంగా శోషించబడేలా చేస్తుంది. దీంతో మత్తు త్వరగా వస్తుంది మరియు ఎక్కువ మొత్తంలో ఆల్కహాల్ తాగే అవకాశం ఉంటుంది.

**మూత్రపిండాల సమస్యలు:** మద్యం మరియు సోడా రెండూ మూత్రపిండాలపై ఒత్తిడిని పెంచుతాయి. దీర్ఘకాలంలో మూత్రపిండాల వ్యాధికి దారితీయవచ్చు.

**జీర్ణవ్యవస్థ సమస్యలు:** సోడాలోని ఆమ్లాలు మరియు కార్బొనేషన్ జీర్ణవ్యవస్థను ప్రభావితం చేస్తాయి. అజీర్తి, గ్యాస్, ఆమ్లత్వం మరియు అల్సర్స్ వంటి సమస్యలు తలెత్తవచ్చు.


**హృదయ సంబంధ సమస్యలు:** అధిక మొత్తంలో ఆల్కహాల్ హృదయాన్ని దెబ్బతీస్తుంది. సోడాలోని సోడియం రక్తపోటును పెంచుతుంది, ఇది హృదయ సంబంధ సమస్యలకు దారితీస్తుంది.

**కాలేయం దెబ్బతింటుంది:** మద్యం కాలేయంపై ప్రభావం చూపుతుంది. సోడా కూడా కాలేయంపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది.

**మెదడుకు నష్టం:** అధిక మొత్తంలో ఆల్కహాల్ మెదడు కణాలను నాశనం చేస్తుంది. దీర్ఘకాలంలో మెదడుకు సంబంధించిన అనేక సమస్యలకు దారితీస్తుంది.

**ఎముకలు బలహీనపడతాయి:** సోడాలోని ఫాస్ఫోరిక్ ఆమ్లం శరీరంలో కాల్షియంను తగ్గిస్తుంది, ఇది ఎముకలను బలహీనపరుస్తుంది.

మద్యం మరియు సోడా రెండూ ఆరోగ్యానికి హానికరం. రెండింటిని కలిపి తాగడం మరింత ప్రమాదకరం. ఆరోగ్యంగా ఉండాలంటే మద్యం మరియు సోడా తాగడం మానుకోవడం మంచిది.




## అవతార్ : ఫైర్ అండ్ యాష్.. పార్ట్ 3

టైటానిక్, అవతార్, అవతార్ ది వే ఆఫ్ ది వాటర్ సినిమాలతో బ్లాక్ బస్టర్‌లను అందుకున్నాడు హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు జేమ్స్ కామెరూన్. ఈ మూడు సినిమాలు హాలీవుడ్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద సునామి సృష్టించాయి. అయితే అవతార్ సినిమాకు సీక్వెల్ రాబోతున్నట్లు జేమ్స్ కామెరూన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ ఫ్రాంచైజీ నుంచి అవతార్, అవతార్ ది వే ఆఫ్ ది వాటర్ చిత్రాలు వచ్చాయి. ఇప్పుడు ఈ ఫ్రాంచైజీ నుంచి మూడో భాగం రానున్నట్లు ఒక ఈవెంట్‌లో వెల్లడించాడు కామెరూన్. అవతార్ మూడవ భాగం అవతార్- ఫైర్ అండ్ యాష్ అనే పేరుతో రాబోతున్నట్లు ప్రకటించాడు. ఈ సినిమాను క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 19 2025న విడుదల చేయనున్నట్లు వెల్లడించాడు. మొదటి భాగంలో గాలి, రెండో భాగంలో నీటిని మూడో భాగంలో నిప్పను ఇలా పంచభూతాల కాన్సెప్ట్‌ను ప్రధాన అంశంగా తీసుకుని సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తుంది.

## సూర్య 'కంగువ' నుంచి క్రేజీ అప్‌డేట్..

ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా కంగువ (Kanguva). శివ (siva) దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ సూర్య 42 ప్రాజెక్ట్‌గా వస్తోంది. స్టూడియో గ్రీన్-యూవీ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీ 3డీ ఫార్మాట్‌లో సందడి చేయనుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి కంగువ గ్లింప్స్‌తో పాటు పోస్టర్‌లు విడుదల చేయగా.. ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఈ సినిమాను దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ మొదలుపెట్టింది చిత్రయూనిట్. ఇందులో భాగంగా ట్రైలర్ అప్‌డేట్‌ను ఇచ్చింది.

